క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

కవిటి: ప్రస్తుత రబీ సీజన్‌లో పండిస్తున్న పంటలకు తప్పనిసరిగా రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ-క్రాప్‌కు సంబంధించిన మార్గదర్శకాలు వివరించారు. సమావేశంలో మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.శిరీష, ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత, ఏవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా విజయలక్ష్మి



బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి

మందస: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా కె.విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పలాస మండలానికి ఎలక్షన్ డీటీగా నియమితులైన ఆమెను మందసలో హెడ్ క్వార్టర్ డీటీగా డిప్యూటేషన్‌పై జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. మందసలో పనిచేస్తున్న హెచ్‌డీటీ డి.సంతోష్‌కుమార్‌ను పలాసలో ఎలక్షన్ డీటీగా నియమించారు. డీటీ విజయలక్ష్మిని తహసీల్దార్ పాపారావుతో పాటు సిబ్బంది అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

ఇచ్ఛాపురం: మండలంలోని రత్తకన్న గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు లెంక మధుసూదన్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులకు శ్రీభగవతి ఆటో యూనియన్ సంఘం సభ్యులు రూ.50 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

రాజీయే రాజమార్గం



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు: కేసుల పరిష్కారానికి రాజీయే రాజమార్గమని కాశీబుగ్గ రూరల్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పోలీసుస్టేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. గ్రామస్థాయిలో తలెత్తిన తగాదాలు, చిన్న చిన్న సమస్యలను సాధ్యమైనంత వరకు గ్రామాల పెద్దల సమక్షంలోనే పరిష్కరించాలన్నారు. ఆయనతో పాటు ఎస్‌ఐ మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.

యువకుడు అదృశ్యం



దుద్దు మురళి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 30వ వార్డు రాజమ్మకాలనీకి చెందిన దుద్దు మురళి అనే యువకుడు శుక్రవారం అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా పరిహారం అందజేస్తున్న దృశ్యం

నందిగాం: మండల కేంద్రానికి చెందిన అడప రామారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పరిహారం కింద మంజూరైన రూ.5 లక్షలను ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, జగనన్న సచివాలయ కన్వీనర్ల మండల చైర్మన్ జద్యాడ జయరాం, అంబోడి విష్ణులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

టెక్కలి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మార్చి 21 వరకు కోడ్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ఇచ్ఛాపురం రూరల్: సంతోషిమాత ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు



కవిటి: చింతామణి అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



పలాస: భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: భూమిపూజ చేస్తున్న బృందావతి తదితరులు



కోటబొమ్మాళి: స్వామివారి దర్శనానికి వచ్చిన కృపారాణి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సంతోషిమాత ఉజ్జీపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు ఏకరూప దుస్తులు ధరించి ఉపవాసాలతో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అనంతరం స్థానిక బాహుదానదిలో నిమజ్జనం చేశారు.

అమ్మవారికి చల్లదనం

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం, కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి ఇందిరాదేవి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మణికుమార్‌ల ఆర్థిక సాయంతో కవిటి ఉషోదయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చల్లదనం నిర్వహించారు. ముందుగా అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దలను కాళికాదేవి వేషధారణ, మేళతాళాలతో పట్టణ వీధుల్లో ఊరేగించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దసంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణం నేడు

టెక్కలి: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు స్వామివారి తిరువీధి ఉత్సవాలు, అన్నదాన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

విగ్రహం నిర్మాణానికి భూమిపూజ

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహం నిర్మాణానికి గ్రామానికి చెందిన విజయలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సిల్లా ప్రసాద్ దొర, విజయలక్ష్మి దంపతులు శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ, ఉంగ సాయికృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, సర్పంచి బాడాన పుష్ప, ఎంపీటీసీ తుంగా రమణమ్మ, మాజీ ఎంపీటీసీ దంతం వైకుంఠరావు, పొందర ఈశ్వరరావు, కర్ర గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 19వ వార్డు సూదికొండ గ్రామ దేవత కొండమ్మ తల్లి ఆలయం పునః నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. వార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శిష్టు గోపిల చేతులమీదుగా వేదపండితులు భూమిపూజ చేయించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జోగ తిరుపతి, సీపాన ఈశ్వరరావు, పిట్ట భాస్కరరావు, పూజారి నాగరాజు, మాణిక్యం, సారధి కొనారి, ఆది, మార్పు చిన్న, మల్లా దిలీప్, దుమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

కోటబొమ్మాళి: మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ పొడుగుపాడు గ్రామంలో ఉన్న కోదండ రామస్వామి ఆలయం 31వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారిని కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి దర్శించుకున్నారు. ఆమెను సర్పంచ్ నూక సత్యరాజ్ సాదరంగా ఆహ్వానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సోమేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న యువజన సంఘం సభ్యులు

కాశీబుగ్గ: సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే బొడ్డపాడు యువజన సంఘం ధ్యేయమని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తామాడ క్రాంతి, బొడ్డు యుగంధర్‌లు తెలియజేశారు. బొడ్డపాడులోని అమరవీరుల స్మారక మందిరం వద్ద విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న అసమానతలు తొలగించేందుకు 1954లో సంఘం ఏర్పడిందన్నారు. నాటి నుంచి ఈ ప్రాంతలో విద్యాభివృద్ధికి కృషి చేస్తూ 69వ వసంతంలోకి అడుగుపెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 12న జరిగే సంఘం వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బొడ్డపాడు యువజన సంఘం దేశానికి ఆదర్శమని, ఈ యువజన సంఘంపై మహారాష్ట్రకు చెందిన గాంధీ మెమోరియల్ రీసెర్చ్ సభ్యులు పరిశోధన చేసి సంఘం విశిష్టతను దేశ నలుమూలలు తెలియజేయనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ఉత్తరాంధ్ర కళలతోపాటు, కళారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన అరుణోదయ విమలక్క ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సిక్కోలు జానపద గాయకులచే జానపద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వేడుకల్లో రైతు కూలి సంఘం నాయకుడు తాండ్ర ప్రకాష్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామ్రేడ్ హెచ్.ఆర్.జగన్నాథం, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి పాల్గొంటారన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జు దశరథరావు, కోశాధికారి తామాడ గంగయ్య, సంఘ సభ్యులు గేదెల జానకిరామ్, తామడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, బి.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



వ్యాక్సినేషన్ చేస్తున్న మాజీ ఎంపీ విశ్వనాథం

కాశీబుగ్గ: ఆరోగ్యమే మహాభాగ్యమని మాజీ ఎంపీ, లయన్స్ క్లబ్ పీడీజీ డాక్టర్ కణితి విశ్వనాథం అన్నారు. మున్సిపాలిటీ పరిధి చినబడంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో టైఫాయిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టైఫాయిడ్ జ్వరాలను అరికట్టేందుకు ముందస్తుగా టైఫాయిడ్ వ్యాక్సిన్ మార్కెట్‌లో లభిస్తోందన్నారు. దీనిలో భాగంగా ముందస్తుగా సుమారు 310 మందికి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ తరుపున నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వలన 3 సంవత్సరాల వరకు టైఫాయిడ్ జ్వరం రాకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.అప్పారావు, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, తెప్పల కృష్ణమూర్తి, కుమార్ నాయక్, కణితి హేమాచలం, కేపీ రామన్న, ఆర్.హేమాచలం, కవిటి భారతి తదితరులు పాల్గొన్నారు.

శిల్ప కళాకారులకు సత్కారం



వడ్రంగి కళాకారులను సన్మానిస్తున్న ముత్యాలపేట గ్రామస్తులు

కవిటి: దేవాలయాల నిర్మాణాల్లో విశేష సేవలందిస్తున్న కె.కపాసుకుద్ధికి చెందిన వడ్రంగి బొమ్మాళి బాబూరావు, కాకినాడకు చెందిన శిల్పి సోడాబత్తుల ఏసుబాబులను ముత్యాలపేటలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. గ్రామంలోని ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం ఆలయం ప్రధాన మార్గంలో గర్భగుడికి ద్వారం, అంతరాలయంలోకి వెళ్లేం దుకు మార్గంలో ద్వారాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వారిద్దరినీ సత్కరించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ కాయ దమయంతి, ఉపసర్పంచ్ పాతిన చంద్రశేఖరం పాల్గొన్నారు.

'నిధుల తగ్గింపు దారుణం'

వజ్రపుకొత్తూరు రూరల్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కేటాయించాల్సిన నిధులను తగ్గించడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘ నాయకురాలు దుబ్బ భానుమతి అన్నారు. మండలంలోని నగరంపల్లిలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ తక్షణమే నిధులు, పని దినాలు, వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. అమదాలవలస మండలంలో మొన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి కూలీలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. ఆమెతో పాటు రైతు సంఘ నాయకులు డి.భాస్కరరావు, బి.రామకృష్ణ, సరోజిని తదితరులు ఉన్నారు.

హారికకు అభినందనలు



హారికను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

టెక్కలి: ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బెస్ట్ గోల్ కీపర్‌గా నిలిచిన చిలుక హారికను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అభినందించారు. హారిక మరిన్ని విజయాలు సాధించాలని ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


వైఎస్సార్ బీమాతో మేలు



తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ పద్మావతి

సోంపేట: వైఎస్సార్ బీమాతో కష్టకాలంలో పేద కుటుంబాలకు మేలు జరుగుతోందని జింకిభద్ర సర్పంచ్ తామడ పద్మావతి అన్నారు. గ్రామానికి చెందిన రాయల నరసింహమూర్తి ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. దీంతో అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాహుకారి జానీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



ఆలయ ధర్మకర్తలకు రూ.లక్ష నగదును అందిస్తున్న రామరాజు

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురంలో రామాలయాన్ని గ్రామస్తులు నిర్మిస్తున్నారు. మూల విగ్రహాలకు రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పారిశెల్లి రామరాజు రూ.లక్ష నగదును విరాళంగా గ్రామ పెద్దలకు శుక్రవారం అందించారు. ఆలయ నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆలయ ధర్మకర్తలు బోంగు రామారావు, అంపోలు మధు అన్నారు. కణితి బాలయ్య, డి.కుమార్, కె.కృష్ణమూర్తి, బి.ఉమాశంకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి రూరల్: టెక్కలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లోని అంగన్‌వాడీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కూర్మనాథపురంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ) -1 పోస్టుకు, అంగన్‌వాడీ సహాయకులు బావనపాడు-1లో(ఓసీ)-1, మరువాడ-1లో (ఓసీ)-1, బోరుభద్ర-1లో (ఓసీ)-1, మేఘవరం-2లో (ఓసీ)-1, తెలినీలాపురంలో (ఓసీ)-1, సీతానగరంలో (ఓసీ)-1, శివరాంపురంలో (ఓసీ)-1, కొండభీంపురంలో (ఓసీ)-1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి సురాడివానిపేట గ్రామంలో (ఓసీ)-1, వీఆర్‌కే పురం (ఓసీ)-1, ఆర్.సున్నాపల్లి (ఓసీ)-1 పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పోస్టులకు దరఖాస్తులు చేసుకునేవారు 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండి, స్థానిక వివాహిత అయ్యి ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణత, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు 7వ తరగతి ఉతీర్ణత సాధించినవారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి అందజేయాలని కోరారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పురాణం నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గతంలో సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లో రోస్టర్ విధానంలో అర్హులైన అభ్యర్థుల ద్వారా దరఖాస్తులు కోరినప్పటికీ, స్థానికంగా అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో మిగిలిన పోస్టులకు 'ఓసీ' కేటగిరిగా పరిగణించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. తలతంపర-1 అంగన్‌వాడీ కార్యకర్త, తిప్పనపుట్టుగ-1, కవిటి-3, కాపు కపాసుకుద్ధి, బైరడ్లపుట్టుగ, శవసానపుట్టుగ, రాపాకపుట్టుగ, రఘునాధపురం, దొళాయిపుట్టుగ, ఆర్.గెదెలపాడు, ప్రధానపుట్టుగ, మఠం కంచిలి, కర్తలి, బసవపుట్టుగ, బిన్నల కొత్తూరు, సామంతపుట్టుగ, ఎస్.జి.పురం, ఉప్పరిపేట, తలతంపర-1, అరకభద్ర-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రూరల్ ఐసీడీఎస్ కేంద్రానికి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న ఎంపీపీ డొక్కరి దానయ్య

మందస: ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతోందని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో, జిల్లా క్షయ నియంత్రణాధికారి ఎస్.అనురాధ, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. నాడు-నేడు పనులతో ప్రైవేటు ఆస్పత్రులను తలదన్నేలా మారుతున్నాయన్నారు. గతంలో క్షయవ్యాధి సోకితే మరణిస్తారన్న భావన ఉండేదని, నేడు తొలగిపోయిందన్నారు. ప్రభుత్వం పూర్తి కోర్సు ద్వారా రోగులకు మందులు అందిస్తోందన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ అందించిన కిట్లను టీబీ రోగులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ కొర్నాని ఆదినారాయణ, వైద్యాధికారులు మద్దిల సంపత్‌రావు, టి.శైలజ, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గన్న సూర్యారావు, పార్టీ నాయకులు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, మట్ట ఆనందరావు, టీబీ డిస్ట్రిక్ ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ ప్రగడ శ్రీనివాసరావు, ఫార్మసిస్టు టి.లీలారాణి, స్టాఫ్‌నర్స్ హెచ్.వెంకటలక్ష్మి, హెచ్‌వీ ఎస్.రుక్మిణి, పీహెచ్‌ఎన్ ఎస్.కాంతమ్మ, ఎల్టీ వై.నాగరాజు, హెచ్‌ఏలు ప్రేమ్, శ్రీధర్, రెడ్‌క్రాస్ జిల్లా కో-ఆర్డినేటర్లు బి.శ్రీధర్, కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నాగరాజు

మందస: వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల వ్యవసాయాధికారి కె.నాగరాజు, ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ శంకర్‌దాస్‌లు అన్నారు. పట్టణంలోని సచివాలయం-1లో వ్యవసాయ, ఉద్యానవనశాఖ సిబ్బంది, రైతులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని సచివాలయాల పరిధిలో నేటికీ ధాన్యం కొనుగోలు లక్ష్యాలు పూర్తవ్వలేదన్నారు. ఈనెల 13వ తేదీలోగా ఈ-క్రాప్ బుకింగ్ ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని ఎంపిక చేసిన నారాయణపురం, భేతాళపురం, అంబుగాం, దున్నవూరు, హరిపురం, కొండలోగాం, సాబకోట, పిడిమందస గ్రామాల్లో తోటబడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో జలవనరులశాఖ ఏఈ ఎస్.వి.శ్రీనివాసరావు, మండల రెవెన్యూ అధికారి సవర చిన్నారావు, వ్యవసాయ విస్తరణాధికారి బల్లు జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే వ్యాధులు నయం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయ్‌కుమార్ రెడ్డి

వజ్రపుకొత్తూరు రూరల్: చర్మ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ రెడ్డి అన్నారు. గ్రామంలోని గురుకుల పాఠశాలలో కుష్టు వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహనతోనే కుష్టు రహిత సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించి వైద్యం అందిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. చర్మంపై మచ్చలు ఏర్పడిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాపారావు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ నిర్మూలనపై అవగాహన



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: పట్టణంలో వెట్టి చాకిరీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెట్టి చాకిరీ చేయిస్తున్న యజమానులపై వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం 1976 కింద చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్మికులకు ప్రతీనెలా సక్రమంగా జీతాలు అందజేయాలన్నారు. 18 ఏళ్లలోపు వారిని పనిలోకి తీసుకుంటే చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది, పట్టణంలో దుకాణాల సిబ్బంది, యజమానులు పాల్గొన్నారు.

పెరిగిన కట్టెజనుము సాగు విస్తీర్ణం



తురకపేట వద్ద కట్టెజనుము సాగు

ఎల్.ఎన్.పేట: మండలంలో కట్టెజనుము సాగు విస్తీర్ణం గతంలో 200 ఎకరాలు ఉంటే ఈ ఏడాది 400 ఎకరాలకు పెరిగిందని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. నూనె గింజల దిగుబడిని ఇచ్చే కట్టెజనుము సాగు ఆరుతడి పంటగా చేస్తుంటారు. మండలంలోని వంశధార నదీ తీర గ్రామాలైన లక్ష్మీనర్సుపేట, పెద్దకోట, వాడవలస, బసవరాజుపేట, స్కాట్‌పేట, మోదుగువలస, మిరియాపల్లి, దబ్బపాడతోపాటు ధనుకువాడ, చిట్టిమండలం, రావిచెంద్రి, పూశాం, బొత్తాడసింగి, జాడుపేట, ఫాక్సుదొరపేట తురకపేట, సిద్ధాంతం, బరటాం తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ పంట కోసం పెట్టుబడి ఎక్కువగా అక్కరలేదని, విత్తనాలు వేసుకుంటే దిగుబడి వస్తుందని, రైతులకు లాభంగానే ఉంటుందని ఏఓ చెప్పారు.